క్లుప్తంగా

ఈ-క్రాప్ ముసాయిదా జాబితా సామాజిక తనిఖీ

వాల్మీకిపురం : మండలంలో ఖరీఫ్ 2023 సీజన్‌లో 6522.46 ఎకరాల్లో పంటల సాగు, ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ వాణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 29 వరకు ఈ-క్రాప్ ముసాయిదా, గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ సభల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల ఈ-క్రాప్ నమోదు అన్ని వివరాలను సమగ్రముగా చదివి, వినిపిస్తారన్నారు. రైతులు అభ్యంతరములు ఏమైనా ఉంటే రాతపూర్వకముగా తెలియజేయాలని ఆమె సూచించారు.

ఈ క్రాప్ బుకింగ్‌పై సామాజిక తనిఖీ

పెద్దతిప్పసముద్రం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో భాగంగా మండలంలోని 6,587 మంది రైతులు 13,728 ఎకరాల్లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు పూర్తి చేసామని ఏవో ప్రేమలత అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు సాగు చేసిన పంటలు, రైతుల వివరాలతో కూడుకున్న ముసాయిదాను ఈ నెల 29 వరకు ఆర్‌బీకేల్లో ప్రదర్శించిన అనంతరం ఆర్‌బీకే ఇన్‌చార్జులు గ్రామసభలు నిర్వహించి ఈ క్రాప్ నమోదు వివరాలను రైతుల సమక్షంలో చదివి వినిపిస్తారన్నారు. అభ్యంతరాలుంటే రైతులు రాత పూర్వకంగా అధికారులకు అందజేయాన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియ వంద శాతం పకడ్బందీగా ఉండాలనే ఉద్దేశంతోనే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

31న మెగా జాబ్‌మేళా

వాల్మీకిపురం : ఈ నెల 31వ తేదీన ఉదయం 9గంటలకు స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20 కంపెనీలు పాల్గొంటున్నాయని, 18 సంవత్సరాలు పైబడి, 28 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగులు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7799587687, 9966086996లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పట్టాభిరాముడికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం : టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం పవిత్రాలు ప్రతిష్ట కార్యక్రమం కనులపండువగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చతుస్థానార్చనం, స్నపన తిరుమంజనం, హోమాలు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, క్రిష్ణప్రసాద్ భట్టార్, సిబ్బంది క్రిష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన కోసమే స్త్రీ నిధి రుణాలు

తంబళ్లపల్లె : వైఎస్సార్ క్రాంతిపథం మహిళా సంఘ సభ్యులు మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ప్రభుత్వం స్త్రీనిధులు రుణాలు మంజూరు చేస్తోందని మేనేజర్ అమరావతి తెలిపారు. గురువారం స్త్రీ నిధి కార్యాలయంలో సభ్యులకు రుణాలపై అవగాహన కల్పించారు. మండలంలో రూ.4.4 కోట్లు లక్ష్యంగా రూ.3కోట్లు రుణాలు అందించామన్నారు. మహిళా సభ్యులకు రూ.50-70వేల స్త్రీ నిధి రుణం ఇస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లిస్తే మరింత రుణం పొందవచ్చున్నారు. సమావేశంలో సీసీలు భవానిశంకర్, బద్రి, ఆదిలక్ష్మీ, తులసీ, ఆశాద్ బేగం, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు వందశాతం పూర్తి



కాకులారంపల్లెలోనిర్వహించిన ఈ క్రాప్ సామాజిక తనిఖీ గ్రామ సభ

పీలేరు : మండలంలో ఈ క్రాప్ నమోదు వంద శాతం పూర్తైనట్లు ఏడీఏ వై.వి. రమణరావు తెలిపారు. గురువారం మండలంలోని కాకులారంపల్లె, బాలంవారిపల్లెలో ఈ క్రాప్ సామాజిక తనిఖీ, గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సందర్శించిన ఏడీఏ మాట్లాడుతూ ఈ పంట సామాజిక తనిఖీ కొరకు ముసాయిదా జాబితా నుంచి ఈ నెల 29వ తేదీ వరకు రైతు బరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించబడుతుందని తెలిపారు. రైతులు పంట అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని కోరారు, నవంబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో రమాదేవి, ఎంపీటీసీ భరత్‌భూషణ్‌రెడ్డి, దామోదర, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మదనపల్లె : 13వవార్డు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరం లాంటిదని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 13వవార్డు సచివాలయ పరిధిలో ప్రభుత్వ బాలికల హైస్కూల్, మండలంలోని కొత్తపల్లె-3 సచివాలయ పరిధిలో ఎంపీయూపీ స్కూల్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయన పరిశీలించారు. శిబిరానికి హాజరైన ప్రజలను ఆత్మీయంగా పలుకరించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు సంతృప్తికరంగా ఉన్నాయా? డాక్టర్లు బాగా చూస్తున్నారా..? పరీక్షలు ఉచితంగా చేశారా? మందులు ఇచ్చారా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదోళ్ల ఆరోగ్యానికి అత్యంత రక్షణ కల్పించే పథకం జగనన్న ఆరోగ్యసురక్ష అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అద్భుత పథకమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఆరోగ్యరంగం కుదేలైందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులు లేక, ఆస్పత్రుల్లో వసతులు కరవై, పేదవాడి ఆరోగ్యానికి రక్షణ లేకుండా ఉండేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులు అధునాతన వసతులు, మౌలికసదుపాయాలతో, పూర్తిస్థాయి వైద్యులతో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నాయన్నారు. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ఎందరికో పునర్జన్మను ఇస్తే..ఆయన వారసుడిగా జగన్ మోహన్‌రెడ్డి గతంలో 1,059 ఉన్న ఆరోగ్యశ్రీ వైద్యసేవలను 3,257కు పెంచారన్నారు. పేదల ఆరోగ్యభద్రతకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తపల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని డీపీఓ, స్పెషల్ ఆఫీసర్ మిద్దింటి ధనలక్ష్మి పరిశీలించారు. సిబ్బందికి పలుసూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగు చంద్ర, కౌన్సిలర్లు ఫర్జానారఫీ, డిష్‌రామకృష్ణారెడ్డి, పాల్‌చంద్రశేఖర్, రాజేష్, ఆర్.శివయ్య, రేణుక, సర్పంచ్ ఆసియాబేగం, ఎంపీటీసీ రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, బాలగంగాధరరెడ్డి, షరీఫ్, ఆంజనేయులు, ఎల్ఐసీ.సుధాకర్, బోర్‌వెల్‌వెంకటేష్, బావాజీ, ఏఈ బండపల్లిశిరీషా, సీడీపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు అండ

బి.కొత్తకోట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు అండగా నిలుస్తోందని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. గురువారం మండలంలోని బయ్యప్పగారిపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్యం ప్రభుత్వం అందిస్తోందన్నారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. 510 మంది ప్రజలు షుగర్, బీపీ, ఇతరా పరీక్షలను చేయించుకోగా వైద్యులు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. కంటిరోగులకు పరీక్షలు నిర్వహించారు. మండలంలో అత్యధికంగా వైద్యసేవలు పొందారు. తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, వైస్ఎంపీపీ ఖాదర్‌వలీ, సర్పంచులు భీమగాని నాగిరెడ్డి, లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ రమాదేవి, జెసీఎస్ మండల కన్వీనర్ నేరేళ్ల రెడ్డిహరీ, కోఆప్షన్ నాసిర్‌వలీ, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

6675 మందికి వైద్యసేవలు

పీలేరు : మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో మొత్తం 6675 మందికి వైద్యసేవలు అందించినట్లు ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చివరి రోజు జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం, ముగింపు సమావేశం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, వైద్యసిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు విజయవంతం అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివయ్య, సతీష్‌కుమార్, రమేష్‌రెడ్డి, విజయలక్ష్మీ, వాషీం, దీప తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె : వైద్య శిబిరంలో డాక్టర్లతో మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి



కొత్తకోట: బయ్యప్పగారిపల్లెలో వైద్య పరీక్షల కోసం..



పీలేరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వైద్య సేవలు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పెండ్లిమర్రివాండ్లపల్లెలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలోని పెండ్లిమర్రివాండ్లపల్లె, నల్లగుట్టపల్లె, అచ్చర్లవాండ్లపల్లె, తోటిపల్లె, జరిగడ్డ, దిగువపాళ్యెం, అర్పింటిదిన్నె, తూర్పువడ్డిపల్లె, ఇర్రవాండ్లపల్లె, నాయునివారిపల్లి, ఆరమడకలవారిపల్లె, ఆరుమడ కలవారిపల్లె హరిజనవాడ గ్రామాలలో ఇంటింటిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పేదవాని ఇంటి తలుపు తట్టి గడప గడపలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేశారన్నారు. పెండ్లిమర్రివాండ్లపల్లెలో మంచినీటి పైప్‌లైన్, 24గంటల విద్యుత్ సౌకర్యం కావాలని కోరారు. మురుగునీటి కాలువల నిర్మాణం కోసం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి , కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, బాలయ్యగారిపల్లె ఆర్‌బికె చైర్మన్ ఆర్‌వి, మండలకో ఆప్షన్‌సభ్యులు ఇనాయతుల్లా, మైనార్టీ నాయకులు షావత్‌అల్లీఖాన్, సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ్, ప్రకాష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రదీప్, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కలకడ : కలకడ మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటల నుంచి సాయంకాలం వరకూ బాలయ్యగారిపల్లె పంచాయతీలోని బి.రెడ్డివారిపల్లె, బి.కొత్తవడ్డిపల్లె, బాలయ్యగారిపల్లె, బాలయ్యగారిపల్లె హరిజనవాడ, ఎస్టీ కాలనీ, యర్రయ్యగారిపల్లె, రాజీవ్‌నగర్‌కాలనీ, మసీదు వీధి, ఎరుకలకాలనీ గ్రామాలలో ఇంటింటిని సందర్శించి సమస్యలు అడిగితెలుసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉంటారని, గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, సర్పంచ్ బోర్‌వెల్ మహేష్‌తో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ.. బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు ప్రశంసిస్తున్నారన్నారు. రాష్ట్రచరిత్రలో ఇప్పటివరకు మరే ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమపథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో విద్య,వైద్యం, వ్యవసాయరంగాల్లో విప్లవాత్మక మార్పులు సంభవించాయన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ నిర్మాణాలతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ఏ పథకమైనా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులకు అందించడం జరుగుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వెలుగుచంద్ర, ఎంపీటీసీ రెడ్డిరాణి, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, వైస్ సర్పంచ్ మల్లికార్జున, గ్రామకమిటీ కన్వీనర్లు శివకుమార్, జయరాం, శీన, కృష్ణమూర్తి, కవిత, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీఓ భానుప్రసాద్, హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు పాల్గొన్నారు.

హస్త కళాకారులను ప్రోత్సహించాలి



వస్త్రాలపై పెయింటింగ్‌ను విద్యార్థుల ఎదుట ప్రదర్శిస్తున్న హస్తకళాకారుడు

మదనపల్లె : భారతీయ సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపమైన ప్రాచీన హస్తకళలను ఆదరించి హస్తకళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తిరుపతి హస్తకళల సేవాకేంద్రం ఏడీ సత్యమూర్తి అన్నారు. పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో కేంద్ర, జౌళి మంత్రిత్వశాఖకు చెందిన హస్తకళల అభివృద్ధి కమిషన్ సౌజన్యంతో, పేస్ స్వచ్ఛందసంస్థ సహకారంతో విద్యార్థులకు హస్తకళలపై మూడురోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. మొదటిరోజైన గురువారం కార్యక్రమం ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు హస్తకళలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏడీ సత్యమూర్తి మాట్లాడుతూ... మన దేశంలో ప్రజలు వ్యవసాయరంగం తర్వాత హస్తకళారంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రాచీనమైన కళలను మనమందరం కాపాడుకోవాలన్నారు. హస్తకళాకారులు అత్యంత కళ నైపుణ్యంతో వస్తువులను ఉత్పత్తి చేస్తారన్నారు. హస్త కళాకారుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. ఆల్ ఇండియా హస్తకళల బోర్డ్ మాజీ సభ్యుడు వి.యస్.రెడ్డి మాట్లాడుతూ.. మూడురోజుల పాటు కళాశాలలో జరిగే సదస్సు విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను చైతన్యపరిచేందుకు దోహదపడుతుందన్నారు. హస్తకళలకు సంబంధించిన ప్రదర్శనలను ప్రత్యక్షంగా చూడటం ద్వారా వాటిపై ఆసక్తి పెరిగి మరింతమంది కళాకారులు అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హస్తకళల ప్రమోషన్ అధికారి వినోద్‌కుమార్, కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ ప్రిన్సిపాల్ రమాదేవి, పేస్ శ్రావణ్‌రెడ్డి, హస్తకళాకారులు వెంకటనారాయణ, షేక్‌అలీ, రాజగోపాల్, రాజాలిబేగ్, షిండేజనార్ధన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా ముగిసిన మండల మీట్



మండల్ మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన జరిగిన మండల్ మీట్ సమావేశం సజావుగా ముగిసింది. మండలంలో ఈ క్రాప్ నమోదు పూర్తి చేసిన రైతుల ముసాయిదా జాబితాను ఆర్‌బీకేల్లో ఈ నెల 26 నుంచి 29 వరకు సామాజిక తనిఖీ కోసం డిస్ ప్లే చేస్తామని, అభ్యంతరాలుంటే తన దృష్టికి తీసుకు రావాలని ఏఓ ప్రేమలత సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన, దిశ చట్టాల గురించి ప్రభుత్వం ద్వారా ముద్రించిన పోస్టర్లను ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. రీసర్వే బృందం అధికారులకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు సహకరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ కోరారు. అర్హులై సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల వివరాలు మీ వద్ద ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే దిశగా చొరవ చూపుతానని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి పాలకులకు సూచించారు. జెడ్పీటీసీ శివన్న, వైస్ ఎంపీపీ శోభా, శంకర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు సుబ్బరాం, జిల్లా స్థాయి నామినేటెడ్ నాయకులు కేవీ రమణ, కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డిలు మాట్లాడుతూ పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తూ ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

మదనపల్లె : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణకు నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాధవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహులు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8కి 1,000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ కడపలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుచేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు అమలుచేయకపోవడం శోచనీయమన్నారు. బంద్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, జయబాబు, విష్ణు, ఓబులేసు, కమలాకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా హైవే విస్తరణ పనులు



అంగళ్లు-మదనపల్లె మార్గంలోని సర్కారుతోపు దగ్గర తారురోడ్డు పనులు

కురబలకోట : ములకలచెరువు నుంచి మదనపల్లె దగ్గరున్న తట్టివారిపల్లెకు వరకు జాతీయ (ఎన్‌హెచ్-42) రహదారి విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే ములకలచెరువు నుంచి అమ్మ చెరువు మిట్ట వరకు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి చొరవతో రూ. 332.01 కోట్ల కేంద్ర నిధులతో 41 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు శరవేంగా ఆపై రాత్రింబవళ్లు కొనసాగుతున్నాయి. భూ నిర్వాసితులు, నివాసాలు కోల్పోయిన వారికి దాదాపుగా పరిహారం నిధులు కూడా బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయి. ములకలచెరువు, బురకాయల కోట, అంగళ్లు వద్ద బైపాస్ రోడ్లు వేస్తున్నారు. అంతేగాకుండా దొమ్మన్నబావి నుంచి అంగళ్లు గోల్డన్‌వ్యాలీ మీదుగా బైపాస్ రోడ్డు కలిసే కడప మార్గంలో కొత్తగా వియుపి (వెహికులర్ అండర్ పాస్) పనులు చేపట్టారు. ఈ బైపాస్ దొమ్మన్న బావి నుంచి విశ్వం కళాశాల వరకు ఏర్పాటు చేస్తున్నారు. చేనేత నగర్ నుండి అమ్మ చెరువు మిట్ట వరకు తారు రోడ్డు పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కాలువ పనులు కూడా వడివడిగా చేస్తున్నారు. మరో వైపు విద్యుత్ స్తంభాలను రోడ్డు విస్తరణకు అనుగుణంగా మారుస్తున్నారు. నిర్ణీత లక్ష్యం కంటే ముందుగానే పనులు పూర్తి చేయాలన్న పట్టుదలతో కాంట్రాక్టర్ వేగంగా పనులు నిర్వహిస్తున్నారు. అమ్మ చెరువు మిట్ట వద్ద ప్రమాదకర మలుపును తప్పించి నేరుగా రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే వాహనాలు వేగంగా సాగడంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణతో ఈమార్గంలో రోడ్డుకు ఇరువైపులా భూములకు, గృహాలకు కూడా విలువ పెరిగినట్లు చెబుతున్నారు. మరో వైపు రోడ్డు రూపురేఖలు కూడా పూర్తిగా మారిపోయాయి.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మొలకవారిపల్లె మారెమ్మ గుడి సందర్శన అనంతరం నాయకులతో ఎమ్మెల్యే

కురబలకోట : ప్రతి ఒక్కరూ భక్తిభావం, దైవచింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లెలో కొత్తగా పునర్ నిర్మించిన మారెమ్మ ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గుడి వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించిన కాకర్ల వెంకటాచలపతి, అరుణమ్మ దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి పాలకుడు, పోషకుడు భగవంతుడేనన్నారు. బతకడం కోసం జీవిత కాలంలో మనిషి ఎన్ని కార్యాలు చేసినా దైవాన్ని చేరుకోవడమే చివరి గమ్యమన్నారు. భవ సాగరాన్ని దాటించేది భగవన్నామమేనన్నారు. నిజమైన భక్తుడికి భగవంతుడు దగ్గరగా ఉంటాడన్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా కలసి మెలసి మసలు కోవడం ఆనందాన్ని కల్గిస్తుందన్నారు. ఐకమత్యం అభివృద్ధికి కూడా దోహదపడుతుందన్నారు. చిన్నతట్టివారిపల్లె రంగనాథం, జనార్దన్, ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి, తుంగావారిపల్లె చంద్ర, సురేంద్ర రెడ్డి, నరేంద్ర రెడ్డి, ఉప సర్పంచ్ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షయాప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయండి



సచివాలయ ఉద్యోగులతో చర్చిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సందప్ప

తంబళ్లపల్లె : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షయాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్, జిల్లా అధికారి సందప్ప సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. గురువారం పరషతోపు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల పనితీరు, సంక్షేమ పథకాల తీరుపై ఆరా తీశారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వైద్య, ఆరోగ్య సంబంధిత పూర్తి సమాచారం తెలుసుకునే సమాచారం ఉంటుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సురేంద్రనాథ్, గ్రామ కార్యదర్శి సోమశేఖర్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

కలికిరి : అపరిచిత వ్యక్తులతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రహీముల్లా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలికిరిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత, అక్షర పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మరక్షణ, లైంగిక దాడులను ఎదుర్కోవడంపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులు అపరిచిత వ్యక్తులను నమ్మకూడదన్నారు. అనుమానితులు తారసపడినా, తమ పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలిపాలన్నారు. ఆపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు 100కు డయల్ చేస్తే పోలీసులు కాపాడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మధసూదనాచారి, హెచ్‌సీలు రాజేంద్రప్రసాద్, రఫీ, పీసీలు లక్ష్మీనారాయణ, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాజంపేట రూరల్: వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం రూ.6 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు సీఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని తెలియజేశారు. ఈ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

నందలూరు (రాజంపేట): ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నందలూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ అరుణ్ అన్నారు. గురువారం నందలూరు మండలంలోని పాటూరు, చెన్నయగారిపల్లి, కుంపిణీపురం గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులు ప్రధానమంత్రి ముద్రయోజన, రుణాలు వంటి వాటితో ఆర్థికంగా వృద్ధి సాధించాలని సూచించారు. సీనియర్ మేనేజర్ అరుణ్, ఫీల్డ్ ఆఫీసర్ పునీత్ కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్‌లు శ్రీవాణి, జాహ్నవిదర్, ఆఫీస్ అటెండర్ శ్రీరామ్ కుమార్ పాల్గొన్నారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పుల్లంపేట : పుల్లంపేట మండలం, ఎస్ఆర్ పాలెంకు చెందిన దుగ్గి గంగాధర్ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన కొండూరు రఘురామరాజు, కొండూరు భార్గవరాజు, కొండూరు శ్రీనురాజు, సాయికిషోర్ రాజు, జీవా సుబ్బరాజు, గణేష్ రాజులపై పుల్లంపేట పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు. సెప్టెంబర్ 7న ఎస్ఆర్ పాలెం వద్ద దుగ్గి గంగాధర్‌కు చెందిన పొలం వద్ద గంగాధర్‌పై, ఆయన భార్య, తల్లిపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు కులంపేరుతో దూషించడంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజారక్షణభేరిని విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

రాయచోటి అర్బన్ : విజయవాడలో నవంబరు 15న నిర్వహింప తలపెట్టిన ప్రజారక్షణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి ప్రజారక్షణభేరి కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలుగురాష్ట్రాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నప్పటికీ అధికార,ప్రతిపక్షపార్టీల నేతలు మిన్నకుంటుండడం దారుణమన్నారు. బిజెపి విధానాలతో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడిందని, రాష్ట్రభవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రజలు పెద్దఎత్తున ఉద్యమబాట పట్టాలంటూ పిలుపునిచ్చారు. నవంబ రు 15న నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరికి పార్టీనేతలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, సీపీఎం నేతుల రెడ్డెయ్య, మాధవయ్య, కెవిపియస్ నేత డి.సి.వెంకటయ్య, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.